గత రెండు దశాబ్దాల్లో మార్కెట్ అనేది పెద్ద మాయాజాలంలా మారింది.
ప్రతీది మార్కెట్ వస్తువే. పురాణాల్లో మొట్టమొదట ఈ మార్కెటింగ్ ప్రస్తావన తెచ్చిన
హరిశ్చంద్రుడే ఇప్పుడుంటే, అతను భూమి అమ్మడానికి ఏ రకమైన
వర్చ్యువల్ మార్కెటింగ్‌కి పాల్పడతాడు అన్న ఆలోచనలోంచి పుట్టిన కథ

రిషి శ్రీనివాస్

3

# ఇచ్చోటనే...

చారి పి.ఎస్.





పాత వాక్‌మెన్లో పెట్టిన కేసెట్‌లోని టేప్‌లా బుర్రలోని ఆలోచనలన్నీ చిక్కుబడిపోయాయి. విడిపోతాయేమోనని పెన్సిల్ చెవిలో పెట్టి తిప్పుకున్నాను.

కొలిమిలా ఎండ.

ఏ వీధి నుంచి నడిచెళ్లినా మాంసం ఉడికే మసాలా వాసనల ఆదివారపు మధ్యాహ్నం.

నేను మాత్రం ఊరి చివర ఉంటాను. ఏవో రెండూళ్ల మధ్య అక్రమ సంబంధం కలిపే లూప్ లైన్ లాంటి రోడ్లో. ఆ రోడ్, హైవే కన్నా నాలుగు కిలోమీటర్లు పొట్టి. బయల్దేరిన ఊరు, వెళ్లాల్సిన ఊరు తప్ప మధ్యలో ఉండే బోర్డులు వచ్చాయంటే వచ్చాయి వెళ్లాయంటే వెళ్లాయన్నట్లుండేసరికి వాటి పేర్లు ఎక్కువమందికి గుర్తుండవు.

సరిగ్గా అక్కడుంటాను నేను. మా రియలెస్టేట్ వెంచర్, రోడ్ మీదే ఉందన్న భ్రమ కలిగించే హోర్డింగ్ నీడలో చెమట్లు కక్కుతూ బ్రోచర్లు పైకెత్తి పట్టుకుని దుమ్మురేగ్గొట్టుకుంటూ వెళ్లిపోతున్న కార్ల వైపు చూపిస్తూ ప్రయాసపడుతుంటాను. కార్లో వెళ్లే వాళ్లు కూల్‌గా కనిపించాలని నిక్కర్లేసుకుని వెళ్తుంటే మండుటెండలో నిలబడే నేను మాత్రం అవసరం లేకపోయినా టక్కేసి టై కట్టి అరిస్టోక్రటిక్ లుక్‌ని అమ్ముతుంటాను.

ఎండలో నిలబడ్డా రంగు తగ్గకపోవడానికి నేనేమైనా ఎడ్వర్‌టైజ్ మెంట్ హోర్డింగ్ మీద మహేష్‌బాబునా?

*ఏనాడు నడచినావూ... ఈ ఎడారులలోన...*
*సలలిత ఆరామసీమలనెగానీ...*
*ఏనాడు తలజూపితి ఈ ప్రచండపుటెండకు...*
*అలఘు మాణిక్యకాంతులకుగానీ...*

వాల్తేర్ క్లబ్‌కి చీమకుర్తి నాగేశ్వర్రావుగా పేరుబడ్డ మేనమామ అప్పలస్వామి చిన్నప్పుడెప్పుడో నేర్పిన పద్యాలు అప్రయత్నంగానే ఎండిన పెదాల మీద మెదిలాయి.

''సరైన డ్యూటీ, జీతం ఎటూ లేవు... ఇలా కాకిలా కర్రిగైపోతూ ఏం ముఖం పెట్టుకుని నా కూతుర్ని అడుగుతున్నావ్రా?'' అని మామయ్యడిగినప్పుడు, ''ఆ కాకి ముఖమే,'' అన్నానని తల్చుకుని తల్చుకుని నవ్వుతుంది చందు.

"ఈ ఏడు అయినా సెటిల్ అవ్వు బావా... పెళ్లి చేసుకుందాం. నా సేలరీ కూడా ఓ ఐదు వేలు పెరుగుతాది. సరిపోతాది," అంది చందు ఆ మధ్యెప్పుడో.

సెటిల్ అవ్వడానికి నేను చెయ్యని ప్రయత్నం ఏమైనా ఉందా? వాటర్ బబుల్స్ వ్యాపారం మొదలుపెట్టేను. అది కలిసి రాలేదు. క్రెడిట్ కార్డులమ్మేను. అందులో పెద్ద గ్రోత్ లేదు. కార్ సర్వీస్ సెంటర్‌లో చేరేను. డ్రైవింగ్ రాదని పదిరోజులకే తీసేసారు. హైద్రాబాద్‌లో కాల్ సెంటర్‌లో పని చేస్తున్నప్పుడు చందుకి వేరే సంబంధాలు చూస్తున్నారని చేస్తున్న పని మానేసి వైజాగొచ్చేశాను, రాజధానిలా.

"ఏం పనుల్రా అవి... రోడ్ మీద ఎవడైనా ఎక్స్యూజ్మీ సార్ర్... అని ఎదురైతే బేజారైపోయి దూరం నుంచి పోతామే... ఇంటి గేట్ కొడితే గడియైనా తీయకుండా అవతలకి పొమ్మంటామే... అలాంటోడికి తలుపు తీసి కూతుర్నిస్తార్రా ఎవడైనా?" అన్నాడు మామయ్య.

రేడియోలో పద్యాలు పాడినప్పుడు ఈ గొంతేనా అంత శ్రావ్యంగా ఉండేది అని నన్ను కరుకుగా తిడుతున్నప్పుడల్లా ఆశ్చర్యపోతాను.

"పనికొచ్చే పనులేవైనా చెయ్యిరా. ఒచ్చీ ఏడాది రిటైరైపోతాను. లోకో షెడ్డుకీ నాకూ రుణం తీరిపోతాది. మా యప్ప, బావ బతికుంటే నీ సావు నువ్వు సస్తావని ఒదిలీద్దును. పెళ్లిచేసి ఇల్లరికం తెచ్చుకుందావంటే ఇప్పటికీ నికరమైన ఆదాయం లేదుకదా. అన్నానని కోపగించుకోకు," అని అనాల్సిందంతా అనేస్తాడు.

ఏదో చెయ్యాలి.

మా పక్క వెంచరోడు నాకన్నా ఒకడుగు పొడుగు. రెండడుగులు ముందుకేసి మాకేసి వస్తున్న ఐ10 వైపు చేతులు పైకెత్తి ఊపాడు.

నేను వాడికన్నా బాగా ఊపాలి. ఎగిరెగిరి ఊపాను.

ఇంకా... ఇంకా... 180 డిగ్రీల్లో...

ఎగరాలి. ఎదగాలి. బాగా సెటిల్ అవ్వాలి. చందుని పెళ్లి చేసుకోవాలి. కార్ కొనాలి. అప్పుడు నేనూ ఇలా టక్‌లో కాకుండా నిక్కరేసుకుని ఇదే రోడ్ మీద కార్ డ్రైవ్ చేసుకుంటూ, ఇందాకటి ఎర్ర కారోడిలాగా వెళ్లాలి. కానీ కొనే ఉద్దేశం లేకపోయినా నాలాటోడు కనబడితే ఆగాలి.

అలాగే అనుకున్నాడేమో ఐ10 వాడు ఆగాడు. పక్క వెంచరోడి దగ్గర బ్రేక్ వేస్తే నా దగ్గర ఆగింది. నాలుగైదు వెంచర్ల సేల్స్‌మెన్స్ కార్ వైపు పరిగెత్తారు కానీ అద్దం దించగానే నా ముఖం లోనకి పెట్టి విజయాన్ని చాటుకున్నాను. కారంతా ఏంబీపూర్‌తో చెమ్మ కలిసిన వాసన.

"సూపర్ వెంచర్ సార్. ఇన్వెస్ట్‌మెంట్‌కి మంచి ఆప్షన్. వాకబుల్. రోడ్ ప్రాక్సిమిటీ. ఫార్టీ ఫీట్ రోడ్లు. నార్త్ ఫేసింగ్ కార్నర్ బిట్లున్నాయి. అండర్ గ్రౌండ్ డ్రైనేజ్. క్లబ్ హౌస్ కూడా వస్తాది. మీకు తెలిసే ఉంటాది, ఆనందపురం, పెందుర్తి ఫోర్లేన్ పనులౌతున్నాయి. మన వెంచర్ నుంచి సరిగ్గా పదహారు కిలోమీటర్లు. కొత్తగా ఒచ్చే కేపిటల్ ఇక్కడే తయారౌతాది. ఓసారి చూస్తే మీకూ ఓ ఐడియా ఉంటాది." రోజుకి ముప్పై నలభైసార్లు అప్పజెప్పే పాఠం... కక్కేశాను.

మిగతావాళ్లు కూడా వాళ్ల వాళ్ల బ్రోచర్లు చూపిస్తూ గోడు వెళ్లబోసుకున్నారు కాని ముందు కనబడ్డాను కాబట్టి నన్నే కార్ ఎక్కమన్నాడు ఐ10.

అలవాటైన పద్ధతిలో, నా బైక్ ఉంది సార్ మీరు ఫాలో అయిపోండని నా స్ప్లెండర్ స్టార్ట్ చేసి కదిలాను.

ఆ బోర్డ్ నుంచి ఇసక రోడ్లో పది కిలోమీటర్ల వేగం కంటే వెళ్లే వీలు లేని దారిలో గతుకల్లో నడ్డి విరగ్గొట్టుకుంటూ నాలుగు కిలోమీటర్లు మా వెంచర్ వైపు వెళ్లే ప్రతిసారి వెనుక వస్తున్న కార్ వాడి గురించి ఒకటే అనుకుంటాను. 'ఇక్కడే అన్నాడు... ఇంత లోనికా,' అని నన్ను ఎన్ని తిట్టుకుంటున్నాడోనని!

ఆర్చ్ లోనుంచి లోపటికి కార్ రాగానే మా గురుమూర్తి సార్ తగులుకుంటాడు. కస్టమర్ కార్ దిగగానే నవ్వి పరిచయం చేస్కుంటాడు. కస్టమర్ కనబడగానే ఏదైనా పెద్దగా మొదలెట్టాలంటాడు గురుమూర్తి. మొత్తం ముప్పై ఎకరాల వెంచర్ సార్ అనమంటాడు. ఎన్ని ఎకరాలైనా వాడు కొనేది మూడో నాలుగో సెంట్లు అంతేకదా! దాదాపు అన్నీ సోల్డౌట్ అయిపోయాయి మార్ట్ గేజ్ ప్లాట్లు కాకుండా కొన్నే మిగిలాయి అనమంటాడు. ఫలానా ఏరియాలో ఆటోనగర్, హార్డ్వేర్ పార్క్, డెవలప్మెంట్ సెంటర్ అని, మనం అమ్మే ప్లాట్లున్న ఏరియాకి సంబంధించిన పేపర్ కటింగ్స్ ఫైల్ మెయింటెయిన్ చేసి కస్టమర్లని ఆకట్టుకోవాలంటాడు.

"ఏదో ఒకటి ఒస్తాదని చెప్పాలి బెదరూ... ఏదీ రాని కాడ ఎవడైనా జాగా కొంటాడా? ఒస్తాదో రాదో ముందు ఒచ్చేస్తుందని చెప్పేయాల. సార్... మొన్నే ఇక్కడికి మూడు కిలోమీటర్ల దూరంలో పిచ్చాస్పత్రి సేంక్షనయ్యింది సార్ అని చెప్పిచూడు... పిచ్చాస్పత్రేటి... సేంక్షనవ్వడవేటీ అది సేంక్షనైతే నాకూ నా ప్లాట్కి ఏటి ఉపయోగం అని ఒక్కడడగడు," అని నవ్వుతాడు.

"వుడా ఎప్రూవల్ ఉందా?" అడిగాడు ఐ10.

"ఎల్.ఆరెస్ ఉందండీ... వుడాకి ఎప్లయ్ చేసాం... ఒచ్చే వారం ఒచ్చేస్తాది," అన్నాడు గురుమూర్తి అదో పెద్ద విషయమే కాదన్నట్లు.

ఉద్యోగంలో జాయినైనప్పుడు కొన్ని టెక్నికల్ పదాలు చెప్పాడు. ఎల్.పి.నంబర్ ఏంటి? అది వెబ్సైట్లో ఎలా చూడాలి? కస్టమర్స్కి ఆ లింక్ ఎలా షేర్ చెయ్యాలి? గూగుల్ మేప్స్లో సేటిలైట్ వ్యూ ఎలా చూడాలి? పిన్ ఎలా వాట్సాప్ చెయ్యాలి? లాంటివి.

"ఈరోజుల్లో సంతకం పెట్టలేనోడు కాదురా... ఇంటర్నెట్ వాడ్డం చేతకానోడే నిజమైన నిరక్షరాస్యుడు. రైటే చెప్పేనా?" అంటాడు గురుమూర్తి.

ఐ10 ని పట్టుకుని లే-అవుట్ మొత్తం తిప్పుతూ నాలుగువందల గజాలవి చూపించి టెంప్ట్ చేసి, 337 దైనా ఓకే చేయించే ప్రయత్నం చేస్తే కనీసం 240 గజాలైనా బుక్ చేస్తాడని స్ట్రేటజీ.

"సిక్స్టీ బై ఫార్టీ సార్. ఇంక ఇదే లీస్ట్," అని కొట్టీకొట్టనట్టుగా ఇగో మీద కొడతాడు.

"విచిత్రమైన బతుకు తమ్మీ మనది... మన జన్మకి మనం ఒక అంగుళం నేలయినా కొనగలమా? ఇదేమైనా మన సొంత నేలా? ఓనర్గారిది. అయినా సరే

ఫోజుగా... ‘ఫైనల్ సార్... పదిహేను వేలుకి పైసా తగ్గదు గజం... నచ్చితే కొనండి లేదంటే లేదు,’ అని తేల్చవతలపారీగలం,’’ అని మా బతుకుల్లో ఐరనీ అప్పుడప్పుడు మాకు గుర్తు చేస్తాడు.

ఐ10 కి నచ్చినట్లుగానే ఉంది. ఫొటోలు కొన్ని తీసుకున్నాడు. బ్రోచర్ కార్ డేష్ బోర్డ్ మీద పెట్టుకున్నాడు. ఖాళీ ఉన్న ప్లాట్లు లే అవుట్ మేప్‌లో టిక్ కొట్టి ఇచ్చాడు గురుమూర్తి. అమ్మగలిగిన రేట్ కన్నా నాలుగు వేలు ఎక్కువే రాశాడు. ఈస్ట్ ఫేసింగ్ అయితే ఇంకో వెయ్యి ఎక్కువన్నాడు.

‘‘తొందరేవీ లేదు.. పక్క వెంచర్లలో కూడా చూడండి... మా అంత తక్కువకి ఎవడూ ఇవ్వడు,’’ అని అభయమిస్తూనే, ‘‘ఆళ్లది లిటిగేషన్లో ఉంది. ఈళ్లు కాంపౌండ్ వాల్ కట్టేరేమో కనుక్కోండి... హిహి... అళ్లాల్ల ఫేస్ వన్ భోగాపురంలో ఏశారు చూసేరా? ఉప్పుడు కుక్కలు తిరుగుతున్నాయక్కడ. రాజుల తాళ్లవలసలో గెడ్డ దుక్కు ఉన్న మార్వోడీల వెంచర్ ఓనాడు స్మెసానమని బైట టాకు,’’ అని భయపెడతాడు.

అమూల్యమైన ఆదివారాన్ని ఇన్ని వెంచర్లు చూడ్డానికి వేస్ట్ చేసుకోక ఉన్నంతలో వీడు చెప్పిందేదో బాగానే ఉందని సమాధానపడిపోయి అక్కడినుంచి వెళ్లిపోతారు.

ఇక్కడితో అయిపోలేదు. రేపో ఎల్లుండో ఫోన్ చేసి గీసి గీసి బేరమాడతాడు.

‘‘ఆఫీస్‌కి ఒచ్చి కూర్చుంటే సార్ దగ్గర ప్రైస్ ఫైనల్ అయిపోద్దని మనం పెంచి చెప్పిన నాలుగు నుంచి రెండో మూడో తగ్గిస్తాం. పైనొచ్చే దాన్లోంచి మనకి కమిషన్ ఇస్తారు. ఎలాగుంది?’’ అని నవ్వాడు.

తర్వాత మళ్లీ రోడ్డెక్కుతాను. మళ్లీ ఏ వేగానార్‌నో స్విఫ్ట్‌నో ఆపే ప్రయత్నం చేస్తాను. ఇన్నోవా, ఎకోస్పోర్ట్ ఆగితే కళ్లు మెరుస్తాయి. ఫార్చూనరే బ్రేక్ ఏస్తే చందుతో పెళ్లి కార్డులు ఎక్కడ కొట్టించాలని డ్రీం సీక్వెన్స్‌లోకి వెళ్లిపోతాను. అగో వస్తున్నాయి బళ్లు. బైకులు, ఆటోలు మనకి కనబడకూడదు. కార్లే. కార్లు మాత్రమే. నూటా ఎనభై డిగ్రీల్లో చేతులూపుతూ...

‘‘ఆ ఐ10 పార్టీ ఏవయ్యాడు తమ్ముా,’’ ఓ రెండు రోజుల తరువాత గురుమూర్తి అడిగాడు.

‘‘ఫోన్ చేస్తానని చెప్పేడు కదన్నియ్యా.’’

‘‘అలాగని నువ్వు పల్లకుంటావేటి? అలా ఒగ్గకూడదు. రోజుకోసారి ఫోన్ చేసి ఫాలో అప్ చెయ్యాలి... తెలిసిందా?’’

చేశాను. రెండు సార్లు తీయలేదు. మూడోసారి విసుక్కుని పెట్టేశాడు.

ఒక రిట్జ్ కూడా ఆగాడు. వాడికీ సేం కేసెట్ వేసాడు గురుమూర్తి. రెండు సెలెరియోలు, మూడు పోలోలు కూడా. ఈ ఏడుగురిలో కనీసం అయిదైనా సేల్ చెయ్యాలి. ఇంకా వస్తూనే ఉన్నారు. జనాల దగ్గర ఇంత డబ్బుందా!

* * *

ఆ రాత్రి తలకాయి కూర చేసిందని చందు భోజనానికి రమ్మంటే వెళ్లి మావ య్యొచ్చే లోపు తినేసి బయల్దేరాలని పెద్ద పెద్ద ముద్దలు కూరుకుంటున్నాను.

''మొన్న నాన్న బస్‌లో ఎళ్తున్నప్పుడు రోడ్ మీద అరుస్తూ అమ్మకాలు చేస్తున్న నిన్ను చూసాడట,'' అని, నాలుగు దుమ్ములు వడ్డిస్తూ, ''జాలేసిందన్నాడు. ఇంకేదైనా డ్యూటీ చూస్కోకూడదూ,'' అంది చందు.

''ఎన్నని మారతానే? నా డిప్లొమాకి ఇంకేముజ్జోగం ఒస్తాది? నీలాటి తెల్ల తొక్కుందేటి నాకు... రిసెప్షన్లో చల్ల కదలకుండా కూర్చుని పనిచేస్కోడానికి? అలా ఉజ్జోగాలు మారుతూ ఉంటే స్థిరం తక్కువ నాకొడుకుననుకుంటారు,'' కోపంగా అనగలిగాను. కాదు, తనమీద కోప్పడనిచ్చింది చందు. ఆడవాళ్లు ఆ వెసులుబాటు ఎందుకిస్తారో! బహుశా బైట ఎవరిమీద కోప్పడలేని మన చేతకానితనం తెలిసో ఏమో!

బుంగమూతి పెట్టుకుందని అలిగిన ఆడోళ్ల గురించి అనుకుంటారుగానీ చందు పెట్టినట్టు బుంగమూతి ఎవరూ పెట్టలేరు. అలా పెట్టాలంటే నిజంగా బుంగలా మూతి ఉండాలి. బుగ్గ పట్టుకుని గిల్లి ఆ బుంగని పంక్చర్ చేశాను.

''మాయ్యెక్కడా... మళ్లీ రేడియోయేనా?'' అన్నానోలేదో, ''వింటావా?'' అని వివిధ భారతి పెట్టింది.

నీకు చావు రాదు. మాకు సౌఖ్యము లేదు. గబ్బిలం పాడుతున్నాడు.

''ఎహే... కాసేపు ఆపెయ్...''

''మనది మనమే వినకపోతే ఎలా బావా,'' అంది ఫోన్లో ఏదో చూసుకుంటూ.

ఎంగిలెత్తి పెట్టి కంచం పట్టుకుని పెరట్లోకి వెళ్తున్న నన్ను ఫోన్ చూసుకుంటూనే అనుసరించింది. చెయ్యి కడుక్కుని బలవంతంగా ఫోన్ లాక్కుని చందుని గట్టిగా పట్టుకున్నాను.

''రేపు పొద్దున్నే ఆఫీస్‌కి ఎళ్లాలి... ఒద్దు,'' అంది కావాలనిపిస్తున్నా వద్దనుకునే నవ్వుతో.

మూతి తుడుచుకోక మిగిలిన సేరువ ఆమె ముక్కుకి అంటించాను. చున్నీతో తుడుచుకుని, ''ఛీ,'' అంది. బాగుందనిపించేలా.

తెల్లవారకుండా రాత్రులలాగే ఉండిపోతే ఎంత బాగుంటుంది!

* * *

''ఇంత లేటా... హరిశ్చంద్ర ఏడీ అని సార్ ముమ్మాటడిగేరు.''

''నిన్న పడుకునీసరికి లేటయ్యిందన్నియా... ఏం చెప్పేవు?'' ఆతృతపడ్డాను.

''ఏదో చెప్పబోయేను. ఇన్నిరోజులైనా ఒక్క ప్లాటమ్మలేకపోతున్నాడు. ఈ వారం లోపు ఏదీ సేల్ చెయ్యలేకపోతే పనికిరావొద్దన్నారు,'' అని వేరే ఎవరో పార్టీతో మాట్లాడ్డానికి వెళ్లిపోయాడు గురుమూర్తి.

ఉక్రోషంగా రోడ్డెక్కాను. రోడ్డంతా ఖాళీ. ఒక్కోరోజు అంతే... ఎందుకో ఎక్కువగా మనుషులు రోడ్డెక్కరు. ఎందుకో ఏంటి... ఏ ఇండియా పాకిస్తాన్ మేచో ఉండుంటుంది.

సాయంత్రం చల్లబడ్డాక గురుమూర్తి రోడ్ దగ్గరకు వచ్చాడు.

''ఇప్పటివరకు చూసినవి సెటిల్ చేసీ తమ్ముూ... కొత్తవి తర్వాత పట్టుకుందువు. ఆ పేర్లన్నీ ఫేస్ బుక్‌లో కొట్టు. ఆళ్ల ఇంట్రస్ట్ ఏటో గమనించు. వాట్సాపులో ఫేస్ బుక్లో మెసేజీలు పెట్టు. ఆళ్ల ఆఫీసులో యాపారాలో ఎక్కడో కనుక్కుని అక్కడ కాపు కాయి. నాలుగైదు సిమ్ములు నుంచి ఫోన్ చేస్తే ఏదోకటి తీస్తారు. ఈరోజుకి ఇంటికెళ్లు. ఇండియా బేటింగ్ మొదలైపోకముందే,'' అని అటుగా వస్తున్న మేజిక్ ఏస్ ఆపి ఎక్కి వెళ్లిపోయాడు.

ఐ10 కి మళ్లీ మళ్లీ ఫోన్ చేశాను. ఓ సారి తీసి తర్వాత చేస్తాన్లే అని పెట్టేసాడు.

రిట్జ్‌కి గోపాలపట్నంలో మెడికల్ షాప్ ఉందని ఎఫ్.బి.లో తెలిసింది. కనుక్కుని వెళ్లాను. గిరాకీలున్నప్పుడు డిస్ట్రబ్ చెయ్యకు తర్వాత రా అని చిరాకుపడి పంపించేశాడు. సిమెంట్ సెలేరియో వాడు పాపం మంచోడే. వాళ్ల స్కూల్‌కి వెళ్లి మాట్లాడితే ఖాళీ పిరియడ్లో లే అవుట్లో కొంటే లాభనష్టాలు గురించి ఆలోచించాడు. లోన్ ఇవ్వగలిగిన బ్యాంక్ ఏజెంట్ కాంటాక్ట్స్ నాకు తెలిసినవి ఏవో చెప్పేను. కొంత బేరం ఆడదామని చూశాడు. నా చేతుల్లో ఏంలేదు... సార్‌తో మాటాడుకోండని నవ్వుతూ దులిపేసుకున్నాను. కాల్ చేస్తాలే అని తను నెక్స్ట్ పాఠం చెప్పాల్సిన తరగతిలో దూరాడు.

* * *

''ఎలా ఉందిరా ఉద్యోగం?'' అడిగాడు మామయ్య మూడురోజుల తరువాత, నాకు డ్యూటీలేని ఓ ఉదయాన.

''కొంటామంటున్నారుగానీ ఎవరిదీ అడుగు ముందుకు పడటం లేదు.''

''హ్మ్... సరే... ప్రయత్నం చెయ్యి. నేనూ వొచ్చే కార్తీకందాకా ఓపిక పట్టగలను. ఆలోపు నువ్వొడ్డెక్కిపోతే సరే... లేదంటే ఏదో ఓ సమ్మంధం చందుకి ఖాయం చేసేస్తాను. అసలే తల్లి లేని పిల్లేమో... పురుళ్లు పుణ్యాలూ చేసీ దిక్కుండదని జరుగుబాటు అంతంతమాత్రవనీ సమ్మందం కలుపుకోడానికి జంకుతారు. ఓ పది పదిహేనైనా చూడందే కాదు. మరేటనుకోకు. సాయంకాలం సిమ్మాచలంలో సత్య హరిస్చెంద్ర నాటకమాడుతున్నాను. డ్యూటీ లేపోతే చందుని ఆళ్లాఫీస్ దగ్గర బండెక్కించుకుని అటేపురా,'' అనేసి వెళ్లిపోయాడు.

సముద్రం ఒడ్డున నిలబడకుండానే కాళ్ల కింద ఇసుకంతా ఎవరో లాక్కెళ్తున్నట్లనిపించింది.

ఇంతకాడికి ఇదేరా నీ పెళ్లాం అని చిన్నప్పట్నుంచీ బుగ్గలు పుణకడం ఎందుకు?

గోస్తనీ మీద సగం మిగిలిన రంగులెలిసిన బ్రిడ్జి, కుళ్లిన నిమ్మరసంలో పొర్లిన మషాళా పొత్తు, మోపుకి పెట్టిన రాతితో పాటు ఈదురుగాలికి ఎగిరెళ్లిపోయిన ఆస్బెస్టాస్ పైకప్పులేని కొండవాలు ఎర్ర ఇటికిల ఇల్లు, మన్ను రేణువులు కలిసిన తెలకపిండి ముద్ద, గంటస్తంభం లేని భీమునిపట్నం, వీటన్నిటి మధ్యనెక్కడో చందు లేని నా జీవితం!

నాకు పెద్దగా టైం లేదని అర్థమైంది.

అయిదు ప్లాట్లు అమ్మగలననుకున్నాను గానీ ఒక్కటీ అమ్మలేకపోతున్నాను. ఒక్కసారి పుస్తకంలో కస్టమర్ల పేర్లూ, వివరాలూ రాసుకున్నాను. కేజువల్‌గా చూసి

ఉంటారనుకున్న వాళ్లని పక్కన పెడితే కొనగలిగే స్తోమత, కొనాలనుకునే ఇంట్రస్ట్ ఉన్నవాళ్లు ఓ ముగ్గురు తేలారు. ఎప్పుడు చూసినా ఆంటీల ఫోటోలకి లైకులు కొడుతూ ఫేస్‌బుక్‌లో, స్టేటస్‌లు పెడుతూ వాట్సాప్‌లో ఆన్‌లైన్లో ఉంటారుగానీ ఎప్పుడు మెసేజ్ చేసినా రెస్పాండ్ అవ్వరు. ఫోన్‌చేస్తే ఎత్తరు. ఏం చెయ్యాలో ఆలోచించి మధ్యాహ్నపు ఎండకన్నా ఓ మూడు డిగ్రీలు ఎక్కువగానే బుర్ర వేడెక్కిపోయింది.

సాయంత్రం చందుని బండి మీద ఎక్కించుకుని మామయ్య నాటకం చూడ్డానికి వెళ్లేముందే ఓ కొత్త సిమ్ తీసుకున్నాను.

ఆడిటోరియంలో కూర్చోగానే ముగ్గురికీ లే అవుట్ వివరాలు కొత్త వాట్సాప్ నుంచి మెసేజ్ పెట్టేను. అయితే ఈ కొత్త వాట్సాప్ ప్రొఫైల్‌కి నా ఫోటో కాకుండా కావాలనే చందు ఫోటో డిస్‌ప్లే పిక్‌గా పెట్టాను!

“ఇచ్చోటనే ...” అని మొదలుపెట్టాడు మామయ్య. అవును. ఇచ్చోటనే... ఇచ్చోటనే కొంత జాగా కొనుక్కోవాలి. ఇంకెక్కడో వద్దు. ఇక్కడే కావాలి. కాసింత నేల. ఇచ్చోటనే. అందరికీ కావల్సింది ఇదే... ఇచ్చోటనే...

పెద్దగా జనంలేని ఆడిటోరియంలో, మా పెళ్లి జరుగుతుందో లేదోనని బెంగగా నా భుజం పై ముఖం వాల్చి పక్క సీట్లో కూర్చున్న చందు... నా వాట్సాప్ డిస్‌ప్లే పిక్‌లో మాత్రం సమ్మోహనంగా నవ్వుతుంది. నాతో కలిసి నడిచే చెయ్యి ఇదేనని తన బుగ్గని ఆన్చిన నా జబ్బని గట్టిగా నొక్కి పట్టుకుంది. రెండు వాట్సాప్ మెసేజులొచ్చిన నోటిఫికేషన్స్‌కి జేబులో మొబైల్ నిశ్శబ్దంగా కంపించింది. చూసుకోలేదు. లేదా అప్పుడే చూసుకోదల్చుకోలేదు.

స్టేజ్ పై మామయ్య ఎలుగెత్తి పాడుతున్నాడు...

*ఇది పిశాచులతో నిటాలేక్షణుండు*
*గజ్జె గదలించి యాడు రంగస్థలంబు...*
*ఇది మరణదూత తీక్ష్ణమౌదృష్టు లొలయ*
*నవని బాలించు భస్మసింహాసనంబు...*

*ఆదివారం ఆంధ్రజ్యోతి*
*15 మార్చి 2020*

❋




రిషి శ్రీనివాస్ 8 ఆగస్టు 1989న విజయనగరంలో జన్మించారు. మొదటి కథ రెక్కలు 2014లో ఈనాడు ఆదివారం సంచికలో అచ్చయ్యింది. దాదాపు ఇరవై అయిదు కథలు వివిధ పత్రికల్లో ప్రచురితమయ్యాయి. సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా ఆస్ట్రేలియాలో ప్రస్తుత నివాసం.

***చిరునామా: ప్లాట్ నెం.73, ఎం.ఎస్.ఎన్.కాలనీ, విజయనగరం-535002***
***ఫోన్: 76808 21010 srinivasarishi@gmail.com***